జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-విజయనగరంలీగల్

మార్చి 8న జరుగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి బి.అప్పల స్వామి అన్నారు. సోమవారం ఆయన అధ్యక్షతన సీనియర్ న్యాయ వాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేకంగా పర్మనెంట్ ఇంజక్షన్ సంబంధించిన తగాదాలు ఎక్కువ సంఖ్యలో రాజీ చేయాలని సూచించారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు సత్వర పరిష్కారానికి ఈ జాతీయ లోక్ అదాలత్ ను వేదికగా ఎంచుకోవాలని తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవీ రత్న కుమారి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రమ్య, మొబైల్ కోర్ట్ జడ్జి పి.బుజ్జి, సీనియర్ న్యాయవాదులు కె.వి తమ్మన శెట్టి, బొడ్డు సత్యనారాయణ, సిహెచ్ దామోదర్ రావు, బెల్లాన రవి. కె. రవిబాబు, ఎల్ .సత్యనారాయణ, పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

పాల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు • కలెక్టరేట్ వద్ద పాల రైతుల ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పాల రైతు సంఘం నాయకులు, పాడి రైతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖ డెయిరీ ఆస్తులను లూటీ చేస్తూ ఆవు పాల సేకరణ ధర తగ్గించి, ధరలో కోత పెట్టిన విశాఖ పాల డెయిరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎపి పాల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద పాల రైతుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవు పాలు సేకరణ 10శాతం తగ్గించిందన్నారు. అంతకుముందే నవంబర్‌లో సేకరణ ధర లీటరుకు రూ.4 తగ్గించారని, ఇలా వరుస పెట్టి పాల రైతులను కష్టపెట్టి, నష్టపరుస్తూ రైతులను నిండా ముంచుతున్నారన్నారు. పెరిగిన పశు పోషణ ఖర్చుల భారం రైతు భరిస్తూ సెంటరుకు పాలు పోస్తున్న రైతులకు న్యాయమైన ధర అందించవలసిన బాధ్యతను విస్మరించి డెయిరీ యాజమాన్యం సహకార రంగం స్ఫూర్తికి భిన్నంగా నడుస్తోందన్నారు. విశాఖ డెయిరీ నేడు స్వార్ధపరుల అక్రమాలకు అడ్డాగా మారిందన్నారు. సుదీర్ఘకాలం డెయిరీ యాజమాన్యం బాధ్యతలలో ఉన్న ఆడారి కుటుంబం తనకు ఉన్న మంది బలంతో సహకార రంగాన్ని వీడి కంపెనీ చట్టంలోకి డెయిరీని మార్చుకున్నారన్నారు. దీంతో ప్రభుత్వం పర్యవేక్షణ నుండి తప్పించుకొని అవినీతి, అక్రమాలకు శ్రీకారం చుట్టి డెయిరీ ఆస్తులను లూటీ చేస్తున్నారని అన్నారు. హైదరాబాదులో ఉన్న సొంత డెయిరీకి విశాఖ డెయిరీ నుంచి పాలు, నిధులు మళ్లించి రైతులకు మాత్రం నష్టాలు మిగుల్చుతున్నారని అన్నారు. ప్రభుత్వం విశాఖ డెయిరీపై వేసిన కమిటీ విచారణను వేగవంతం చేసి దోషులను శిక్షించాలని, డెయిరీ ఆస్తులను కాపాడాలని అన్నారు. డెయిరీని కంపెనీ చట్టం నుండి సహకార చట్టంలోకి మార్చాలని డిమాండ్ చేశారు. ఆవుపాల సేకరణ ధర పెంచాలని, ఏడాదికి మూడుసార్లు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎఒకు వినతినిచ్చారు. ధర్నాలో పాల రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు లోకవరపు అది నారాయణ మూర్తి, జిల్లా కార్యదర్శి గొంప కృష్ణమూర్తి, కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.పైడపునాయుడు, రాకోటి రాములు, జామి మాజీ జెడ్‌పిటిసి బండారుపెదబాబు, బోదంకి సన్యాసిరావు, వసంత సర్పంచ్ సత్యం, మాజీ సర్పంచ్ గంగు నాయుడు, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ గోపాలం, బుగత సునీల్, సురీడేముడు, బంగారు నాయుడు, రవి రాజు, కోటేశ్వర రావు, పెంటయ్య, వసంత ఎంపిటిసి నారాయణ పాల్గొన్నారు.

పిల్లలతో అక్షరాభ్యాసాలకు హాజరైన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు

ఘనంగా వసంత పంచమి వేడుకలు

సరస్వతి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు • వేలాదిగా తరలివచ్చిన చిన్నారులు, తల్లిదండ్రులు

వసంత పంచమి సందర్భంగా రెండో బాసరగా ప్రసిద్ధి గాంచిన విజయనగరంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో సోమవారం సామూహిక అక్షరాభ్యాసాలు ఘనంగా జరిగాయి. పిల్లలకు అక్షరాభ్యాసాలు చేసేందుకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి సైతం వేలాదిగా తరలి వచ్చారు. రెండు నెలల ముందు నుంచే అక్షరాభ్యాసాల కోసం టోకెన్లు పొందడంతో ఆదివారం రాత్రికే ఇతర ప్రాంతాల వారంతా విజయనగరం చేరుకున్నారు. ఈనేపథ్యంలో జిల్లా కేంద్రంలో హోటళ్ళు, లాడ్జీలు కిటకిటలాడాయి. సోమవారం వేకువ జాము నుంచే అక్షరాభ్యాసాలు ప్రారంభమై బ్యాచ్‌ల వారీ సాయంత్రం వరకు కొనసాగాయి.

– ప్రజాశక్తి, విజయనగరంకోట

బడ్జెట్‌లో జిల్లాకు అన్యాయం

బడ్జెట్ ప్రతులు దగ్ధం.. ఎస్.కోటలో రాస్తారోకో

ప్రజాశక్తి-కొత్తవలస

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకంగా ఉందని, రాష్ట్రానికి, జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి గాడు అప్పారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం మండలంలోని ఉత్తరాపల్లి రెవెన్యూ పరిధిలో దిబ్బచెరువులో, పాత సుంకరపాలెం చెరువులో కేంద్ర బడ్జెట్ ప్రతులను వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కూలీలంతా దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి, జిల్లాకు తీరని అన్యాయం చేశారని తెలిపారు. ఉత్తరాంధ్ర నీటి ప్రాజెక్టులకు కేటాయింపులు లేవని, ఉపాధి హామీని పట్టించుకోలేదని చెప్పారు. ఉపాధి హామీకి బడ్జెట్ ఎక్కువ కేటాయించాలని డిమాండ్ చేశారు. రోజు కూలి రూ.600 ఇవ్వాలని, జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఏడాదిలో 200 రోజులు పని కల్పించాలని

కొత్తవలసలో నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు , వ్యకాస నాయకులు

శృంగవరపుకోటలో నిరసన తెలుపుతున్న సిపిఎం కార్యకర్తలు

డిమాండ్‌చేశారు. మనిషికి ఒక జాబ్ కార్డు ఇవ్వాలని, ఎన్‌ఎంఎంఎస్ యాప్‌ని రద్దు చేయాలని కోరారు. రెండు పూటల పని ఆపాలని, పని ప్రదేశాల్లో మౌలికసౌకర్యాలు కల్పించాలని, మేట్లకు ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేలు జీతం చెల్లించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో బండ రోజా, సబ్బవరపు భాగ్యలక్ష్మి, మల్లవరం రవణమ్మ, పి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ తెలిపారు. సోమవారం ఎస్.కోట ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ సామాన్య ప్రజానీకానికి గాని, కార్మిక వర్గానికి గాని, రైతాంగానికి గాని అనుకూలంగా లేదన్నారు. ఇది కార్పొరేట్ల అనుకూల బడ్జెట్ అన్నారు. ఈ కార్యక్రమంలో కె.రమేష్, ఎం.రాజు, వి.చరణ్, లక్ష్మి, షేక్ మదీనా, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి ప్రణాళికలు సిద్ధం చేయండి

• 15 శాతం వృద్ధిరేటు సాధించాలి • కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలుపై మూడు రోజుల్లో ప్రగతి నివేదికలను తయారు చేయాలని వివిధ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతిపై కలెక్టరేట్లో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలకు అనుగుణంగా 15 శాతం అభివృద్ధి రేటు ఉండేలా ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ఏడాది ప్రణాళికలను, లక్ష్యాలను తయారు చేయడంపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. వివిధ ప్రభుత్వ పథకాలపై సమీక్షిస్తూ, పదిరోజుల్లో అన్ని ప్రభుత్వ శాఖల్లో ప్రగతి కనిపించాలని, మూడు నెలల ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన, సూక్ష్మ సేద్య పథకాలపై సమీక్షిస్తూ, క్షేత్రస్థాయిలో రైతులను చైతన్య పరచాలని సూచించారు. ముఖ్యంగా బిందుతుంపర్ల సేద్యం, ఉద్యాన సాగు పెంపు, ఆయిల్‌పాం, నాణ్యమైన మొక్కల ఉత్పత్తి, డ్రోన్ టెక్నాలజీ వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు. వీటిని నిరంతరం పర్యవేక్షించాలని జెసి సేతుమాధవన్‌కు సూచించారు. షెడ్యూల్ ప్రకారం జరపవలసిన శాఖాపరమైన సమావేశాలను నిర్ణీత వ్యవధిలోనే నిర్వహించాలని, లేదంటే దానికి ఆయా శాఖాధిపతులే బాధ్యత వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

పత్రికల్లో వచ్చిన వార్తలపై సమీక్ష

వివిధ పత్రికల్లో వచ్చిన సానుకూల, వ్యతిరేక వార్తలపై ఈ సమావేశంలో కలెక్టర్ చర్చించారు. ఈ రోజు పలు పత్రికల్లో వచ్చిన వార్తలను చదివి వినిపించారు. ఇకనుంచీ పత్రికల్లో వస్తున్న వార్తలను ఏరోజుకారోజు పరిశీలించి, ఆ సమస్య పరిష్కారం అయ్యేలా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తప్పుడు సమాచారంతో వార్తలు రాస్తే నేరుగా గానీ, సమాచార శాఖ ద్వారా గానీ వివరణ ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జెసి ఎస్.సేతు మాధవన్, సిపిఒ పి.బాలాజీ, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు

ప్రజాశక్తి-విజయనగరం కోట

కోరుకొండ సైనిక్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న ఉత్కర్ష్ బనాకా (13) తల్లిదండ్రుల చెంతకు చేరాడు. తప్పిపోయిన బాలుడిని విజయనగరం రూరల్ పోలీసులు అగర్తలాలో కనుగొని, తల్లిదండ్రులకు సోమవారం అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం...

కోరుకొండ సైనిక్ స్కూల్ విద్యార్థి ఉత్కర్ష్ బనాకా సంక్రాంతి సెలవులకు హైదరాబాద్‌లోని వారింటికి వెళ్లాడు. సెలవుల అనంతరం గత నెల 18న హైదరాబాద్ నుంచి విజయనగరం వచ్చేందుకు నాగావళి ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. జనవరి 19న సైనిక్ స్కూల్‌కు విద్యార్థి చేరుకోవాల్సి ఉంది. కుమారుడి నుంచి సమాచారం లేకపోవడంతో తండ్రి మోహన్ బనాకా ఆ పాఠశాలకు ఫోన్ చేశారు. ఉత్కర్ష్ ఇంకా పాఠశాలకు రాలేదని సిబ్బంది చెప్పారు. దీంతో విద్యార్థి తండ్రి సూచనలతో విజయనగరం రూరల్ పోలీసు స్టేషనులో పాఠశాల సిబ్బంది ఫిర్యాదు చేశారు. ఈ కేసు విషయంలో ఎస్‌పి వకుల్ జిందాల్ ప్రత్యేక శ్రద్ధ కనబర్చి, ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి, స్థానిక పోలీసులను అప్రమత్తం చేశారు. అన్ని విభాగాలకు విద్యార్థి వివరాలు పంపించి, కేసును ఎప్పటికప్పుడు స్వయంగా పర్యవేక్షించారు. చివరికి అగర్తలాలో ఉన్నట్లుగా గుర్తించారు. దీంతో అగర్తలా రైల్వే పోలీసులకు విద్యార్థి పంపి, వారి సహకారంతో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విజయనగరం రూరల్ ఎస్‌ఐ వి.అశోక్ కుమార్, సిబ్బంది అగర్తలా వెళ్లి విద్యార్థిని విజయనగరం తీసుకొచ్చారు. సోమవారం ఎస్‌పి కార్యాలయంలో తల్లిదండ్రులకు ఆ విద్యార్థిని అప్పగించారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన విజయనగరం రూరల్ ఎస్‌ఐ వి.అశోక్‌కుమార్, ఇతర పోలీసు సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

ఎంఎస్‌ఎంఇ సర్వే శతశాతం పూర్తి చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో అన్ని సచివాలయాల పరిధిలో ఎంఎస్‌ఎంఇ సర్వే శతశాతం పూర్తిచేయాలని కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. సోమవారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో శానిటేషన్, అడ్మిన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రాధాన్యతాంశం గా ఎంఎస్‌ఎంఈ సర్వే త్వరితగతిన పూర్తి చేసి నివేదికలను ఉన్నతాధికారులకు అందించాల్సి ఉందని, కావున కార్యదర్శులు దీనిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి మిగిలి ఉన్న సర్వేను పూర్తి చేయాలని అన్నారు. ట్రేడ్ లైసెన్సులు ఈ నెలాఖరునాటికి శత శాతం వసూలు చేయాలని చెప్పారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, టిపిఆర్ఒ సింహాచలం, ఎఒ సీతారామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపు వైసిపి ఫీజుపోరు

పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ఈనెల 5న ఫీజు పోరు పేరుతో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముందుగా ఫీజుపోరు గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్రైమాసికాలుగా బకాయి పెట్టిన ఫీజు రీయింబర్స్ మెంట్, వసతి దీవెన కింద ఇవ్వాల్సిన రూ.3,900 కోట్లు తక్షణమే విడుదల చేయాలన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే తనవైఖరి మార్చుకొని విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ కార్యక్రమాలు కూడా అమలు చేయడం లేదన్నారు. ఎన్నికల ముందు సంపద సృష్టించి ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని చెప్పి మోసం చేస్తున్నారన్నారు. ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ 5న జరిగే కలెక్టరేట్ ధర్నాకు అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా మంత్రి పత్రికలతో మాట్లాడుతూ మాట్లాడే ముందు గతంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలూ తెలుసుకొని మాట్లాడాలన్నారు. భోగాపురం విమానాశ్రయం నిర్మాణంలో వైసిపిది ప్రధాన పాత్ర అన్నారు. మంత్రిగా ఉండి జిల్లాకు రూపాయి నిధులు తెచ్చారా అని కొండపల్లి శ్రీనివాసరావును ప్రశ్నించారు. జిల్లాలో సమస్యలు పరిష్కారం చేసి మీ సమర్థతను నిరూపించుకోవాలని మంత్రిని కోరారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి శంకుస్థాపన చేసింది వైఎస్ ప్రభుత్వం అన్నారు. కూటమి ప్రభుత్వం పాలనలో పోలవరం ఎత్తు తగ్గించి ఉత్తరాంధ్రకు పోలవరం నీరు రాకుండా చేస్తోందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో గురజాడ నామజపం చేస్తూ ఈ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. దీనిపై త్వరలో కార్యాచరణ చేసి పోరాడుతామన్నారు. ఢిల్లీలో రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెడుతున్నారని అన్నారు. ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు కూటమి ప్రభుత్వం చేస్తుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, అశపు వేణు, సూర్యనారాయణ రాజు, జై హింద్, బంగారునాయుడు, సత్యలత, భానుమూర్తి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'ర్యాపిడో'ను అనుమతించొద్దు

• కేరళ తరహా ప్రత్యామ్నాయ యాప్‌ను ప్రభుత్వమే తేవాలి • ఆటో రవాణా రంగ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు డిమాండ్ • మార్చి 24న చలో పార్లమెంట్ • ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ పిలుపు • కోట జంక్షన్ వద్ద ధర్నా

కోట జంక్షన్‌లో ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, ఆటో కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆటో, క్యాబ్ డ్రైవర్ల పొట్ట కొట్టే కార్పొరేట్ సంస్థ ర్యాపిడోకు రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, జనాభా రద్దీగా ఉన్న కూడళ్లలో ఇచ్చే అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీకనక దుర్గా ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన స్థానిక కోట జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ కో కన్వీనర్ ఎ.జగన్మోహన్ రావు, ఆటో యూనియన్ నాయకులు బి. పాపారావు, రామునాయుడు మాట్లాడుతూ ఇప్పటికే సరిగా బేరాలు లేక ఇబ్బంది పడుతున్నామని, ర్యాపిడోను అనుమతిస్తే ఉపాధికి తీవ్ర నష్టం జరుగుతుందని అందువల్ల ర్యాపిడోకు విజయనగరంలో అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో కేరళ తరహాలో (సవారి యాప్) ప్రభుత్వమే యాప్ ను నిర్వహించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వంపై మన రాష్ట్ర ఎంపిలు ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. విజయనగరంలో ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించక పోవడంతో రాంగ్ పార్కింగ్ పేరుతో వేలాది రూపాయలు ఫైన్ లు వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రవాణా రంగ కార్మికులను ఒక పరిశ్రమగా గుర్తించి వారి ఉపాధి భద్రతకు, భరోసా కల్పించేందుకు బడ్జెట్లో కేటాయింపులతో పాటు, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ మార్చి 24న చలో పార్లమెంట్‌కు ఆటో, రవాణా రంగ కార్మికులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆటో, క్యాబ్ యూనియన్ నాయకులు , డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ధర్నా

ర్యాపిడో బైక్స్, ఓలా, ఓబర్ వంటి కంపెనీలకు రైల్వే స్టేషన్ లు, బస్టాండు వద్ద లైసెన్స్ లు ఇవ్వడాన్ని విరమించుకోవాలని శ్రీ విజయ దుర్గ ఆటో యూనియన్ (ఎఐఎఫ్‌టియు) ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు బెహరా శంకరరావు, రెడ్డినారాయణరావు, అప్పలరాజు మాట్లాడారు. జిల్లాలో జ్యూట్ మిల్లులు మూతపడడంతో లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు లేక స్వయం ఉపాధిగా ఆటో రంగాన్ని ఎంచుకొని, ఫైనాన్సులు లేక ప్రవేటు వ్యక్తులు వద్ద నుండి అప్పులు చేసి ఆటోల నడుపుకుంటున్నారని, వారి పొట్టకొట్టేలా ఓలా, ఓబర్, రాపిడ్ బైక్‌లకు అనుమతులు ఇవ్వడం అన్యాయమని అన్నారు.

గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఐద్వా, ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ • ఖాళీ బిందెలతో కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశకి-విజయనగరం టౌన్

మెంటాడ మండలంలోని గిరిజన గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి టి.సోములు డిమాండ్ చేశారు. సోమవారం ఈ రెండు సంఘాల ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెంటాడ మండలంలోని ఆంద్ర, లోతు గెడ్డ గ్రామాల్లో గిరిజనులు నివాసం ఉన్న చోట మంచినీటి కుళాయిలు లేకపోవడంతో వేసవిలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూనేరు పంచాయితీలోని ఎగువగుడ్డివలస, దిగువగుడ్డివలస గ్రామాల్లోను, కొండలింగాల వలస పంచాయతీ శీరవలస, సరవిల్లి గ్రామాల్లోను, ఆగూరు పంచాయతీ సంఘంగుడ్డివలస, కిందగూడెం గ్రామాలు, ఆంద్ర పంచాయతీ వేపగుంట వలస, కుంబివలస, కొండజీరికి వలస గ్రామాల్లోను తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. గిరిజనులు ఎక్కడో కొండ పైన ఊటనీరు, గెడ్డనీరు తాగుతున్నారని, దీంతో అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. గిరిజన గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు రోడ్లు వేసి రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.ధర్నా లో వి.రాములు,హరికష్ణ, వి.లక్ష్మి,రామారావు, బలరాం గిరిజనులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు, ఐద్వా, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

విద్యారంగ సంస్కరణలు సత్ఫలితాలివ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వం విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణలు మెరుగైన ఫలితాలివ్వాలి గాని పాఠశాలల మూసివేతకు ఆస్కారం ఇవ్వకూడదని పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎం.కృష్ణయ్య, ఎపిటి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు అన్నారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ 117 జీవో సవరణల్లో భాగంగా ఇప్పుడు ప్రభుత్వం చేపడుతున్న విధానాలు వల్ల యుపి పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉందన్నారు. ప్రాథమిక స్థాయిలో ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగిపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వి.రవీంద్రనాయుడు, డి. శ్రీనివాస్, బంకపల్లి శివప్రసాద్, కె.రామకృష్ణ, ఎవి శ్రీనివాస పాల్గొన్నారు.

ఉపాధి పనులకు ప్రతిపాదనలు

రామభద్రపురం : ఉపాధి హామీ ద్వారా కొత్త పనుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని ఎపిడి రమామణి.. సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో సోమవారం ఆమె ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేతనదారులను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం ఉన్న వేతనదారులకంటే ఎక్కువ మందిని చేర్పించాలని సూచించారు. ఈ ఏడాది మండలానికి మంజూరైన 67 గోకులాల నిర్మాణాలు శతశాతం పూర్తిచేయాలన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జీవనరాణి

పిహెచ్‌సిని తనిఖీ చేసిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - గుర్ల

స్థానిక పిహెచ్‌సిని డిఎంహెచ్ఒ జివన రాణి సోమవారం సందర్శించి తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆరోగ్య కేంద్రం రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బంది అందరు వారివారి విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. హెల్త్ ప్రోగ్రాంలను అమలు పరచడంలో చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న లెప్రసి, భోద వ్యాధి, టిబి, బిపి, షుగర్, కేన్సర్, స్క్రినింగ్ ప్రోగ్రాంలపై దృష్టి సారించాలన్నారు. ఇతర అంటూ వ్యాధులపై దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు.

ఎన్నికల కోడ్ అమలుకు సహకరించండి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎన్నికల కోడ్ అమలుకు సహకరించాలని ఆర్‌డిఒ రామ్మోహనరావు కోరారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు పెట్టవద్దని కోరారు. అల్లర్లు లేకుండా ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు. సమావేశంలో టిడిపి, వైసిపి, బిజెపి ప్రతినిధులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలను అరికట్టండి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని చౌడువాడ పంచాయతీ పరిధిలో గల కృష్ణాపురంలో చెరువుల ఆక్రమణ రెవెన్యూ అధికారులు అరికట్టాలని రైతులు కోరుతున్నారు. రూల్ సప్పిడి సమీపంలో ఉన్న సూరమ్మ చెరువు, కృష్ణాపురం రెవెన్యూలో ఉన్న ఊర చెరువు, ఎర్ర చెరువు ఆక్రమణకు గురవుతున్నాయని చెబుతున్నారు. ఎప్పటి నుంచో కొంచెం కొంచెం చెరువును ఆక్రమిస్తున్న ఆక్రమణదారులు ఇటీవల కాలంలో బరితెగించారన్నారు. చెరువులోకి మన్నువేసి ఆక్రమణ చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై గ్రామ విఆర్ఒకి తెలిపామని వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణలు అరికట్టాలని రైతులు ఎం. నాగబాబు, ఎం. నారాయణ, అప్పారావు కోరారు.

పైపులైన్ లీకుల నివారణ

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో పైపులైన్ లీకులను మున్సిపల్ అధికారులు నివారిస్తున్నారు. బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద వాల్వ్ లీకుతో తాగునీరు వృథాగా పోతోంది. దీంతో లీకులను నివారించాలని ప్రజలు కోరడంతో అధికారులు స్పందించారు. లీకుల నివారణ పనులు చేపట్టారు. పట్టణంలో లీకులను నివారించి పూర్తి స్థాయిలో తాగునీరు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలలో చేస్తున్న అక్షరాభ్యాసాలు

సన్‌రైజ్ పాఠశాలలో అక్షరాభ్యాసాలు

ప్రజాశక్తి-మెరకముడిదాం

వసంత పంచమి సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో ఉన్న సన్ రైజ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సరస్వతి పూజ, సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు నలభై మంది విద్యార్థులకు అక్షరాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ నాగరాజు, ప్రిన్సిపాల్ అరుణకుమారి మాట్లాడుతూ పాఠశాలలో నిర్వహించే విద్యా కార్యక్రమాలు, విద్యార్థుల చదువు పట్ల ఆకర్శితులై తల్లిదండ్రులు స్వతహాగా వచ్చి వారి పిల్లలను చేర్పించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనిధి పాఠశాలలో అక్షరాభ్యాసాలు

బొబ్బిలి : స్థానిక శ్రీనిధి పాఠశాలలో వసంత పంచమి సందర్భంగా సోమవారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. 150 పిల్లలతో సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. కళాశాల, పాఠశాల వ్యవస్థాపకులు రౌతు రామమూర్తి, కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు పాల్గొన్నారు.

శ్రీవిక్టరీ పాఠశాలలో ..

వేపాడ : వేపాడలోని శ్రీ విక్టరీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో సోమవారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ రాఘవ్, ప్రిన్సిపల్ శ్రీను, కరెస్పాండెంట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

శిశుమందిర్‌లో ...

నెల్లిమర్ల : స్థానిక సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసాల కార్యక్రమం నిర్వహించారు పాఠశాల ప్రధానాచార్యులు ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శిశుమందిర్ కార్యదర్శి కందర్ప మురళీకృష్ణ, ఉపాధ్యాయులు అప్పలనాయుడు, ఇందిరబాల, చరిత, శాంతికుమారి, విజయకుమారి, అచ్చియ్యమ్మ, అధిక సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్‌కు చైర్‌పర్సన్ పరామర్శ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అనారోగ్యంతో బాధపడుతున్న 16వ వార్డు కౌన్సిలర్ పాండ్రంకి సత్యవతిని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని సోమవారం పరామర్శించారు. కౌన్సిలర్ సత్యవతి ఆసుపత్రిలో చికిత్స పొంది తిరిగి ఇంటికి వచ్చిన నేపథ్యంలో ఆమెను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట జనసేన నాయకులు బంగారు శంకర రావు, భాను ప్రకాష్, పాండ్రంకి సత్యనారాయణ ఉన్నారు.

కెజిబివిలో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ పంచాయతీ పరిధిలోని బక్కునాయుడుపేట వద్దనున్న కెజిబివిలో తాగునీటి బోరును ఏర్పాటుచేశారు. పంచాయతీ నిధులతో సర్పంచ్ ఎం.అర్జునమ్మ ఈ బోరు ఏర్పాటు చేశారు. కెజిబివిలో తాగునీటి బోరు ఏర్పాటుచేయాలని సామాజిక కార్యకర్త ఆర్.అప్పారావు.. అధికారులకు వినతులు అందజేసినా పట్టించుకోలేదు. దీంతో సర్పంచ్ స్పందించి బోరును తవ్వించి, విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. కెజిబివి సిబ్బంది, విద్యార్థులు సర్పంచ్ అర్జునమ్మకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పిడిఎస్ బియ్యం వేలం

వేలం వేసిన పిడిఎస్ బియ్యం

గజపతినగరం : సీజ్ చేసిన పిడిఎస్ బియ్యాన్ని సోమవారం మధ్యాహ్నం ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద వేలం వేసినట్లు సిఎస్‌డిటి తిరుపతిరావు తెలిపారు. ఈ వేలంలో ఐదుగురు పాల్గొనగా జామి మండలం తానవరం గ్రామానికి చెందిన కుసుమంచి తాతాజీ కేజీ 27 రూపాయల చొప్పున 55.339 మెట్రిక్ టన్నులు బియ్యాన్ని రూ.14,94,153కు చేజించుక్కించున్నట్టు తెలిపారు.

చేపల చెరువులకు అనుమతులివ్వొద్దు

పంట భూములను నాశనం చేయొద్దంటూ తహశీల్దార్‌కు రైతుల వినతి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని వెంకంపేట పంచాయతీ పరిధి మీసాల డోలపేటలోని సర్వే నంబర్ 136, 202-ఎ, 202-20, 202-2ఎ, 200,202-3, 203-1, భూమిలో చేపల చెరువుల తవ్వకాలకు అనుమతులు ఇవ్వొద్దంటూ సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. ఈ ప్రాంతంలో వరి, చెరకు, మొక్కజొన్న ఇతర పంటలు అనుకూలంగా ఉన్నాయని, పంట భూములు చేపల చెరువులుగా మార్చడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మీసాల డోలపేట, వెంకమ్మపేట గ్రామ రైతులు ఎచ్చెర్ల కృష్ణ, సుంకరి అప్పలనాయుడు, పందిరి అచ్చెయ్య, ఆవాల మన్మదరావు, నందిగాన వెంకట నాయుడు, నెల్లి సూర్యనారాయణ, రౌతు కళ్యాణ రావులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చేపల చెరువులు తవ్వడం వల్ల మీసాల డోలపేటలో చాలామంది రైతుల భూములు పాడవుతున్నాయని పంట పొలాలు అన్నీ నీటి మునిగి ఒక్క పంట కూడా చేతికి వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి విలువ సుమారు 30 వేల నుంచి 15 వేల రూపాయలకు పడిపోయిందన్నారు. ప్రజల ఆరోగ్యాలు చాలా నాశనం అవుతున్నాయని చేపలకు వేసిన ఎరువులు వల్ల మిగతా కల్తీ పదార్థాల వల్ల భూమి కలుషితమై చుట్టుపక్కల గ్రౌండ్ వాటర్ విషపూరితమై చాలా ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు మూడు పంటలు పండిన ఈ భూములు ఇప్పుడు ఒక్క పంట కూడా చేతికి రాకపోవడంతో రైతులందరం తీవ్ర ఆందోళన చెందుతున్నామన్నారు. ఈ చేపల చెరువుల తవ్వకాన్ని అడ్డుకోవడానికి అవసరమైతే మత్స్యశాఖ, కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామన్నారు. గ్రామ సచివాలయాల ముందు కూడా తీవ్రమైన నిరసన, ధర్నా, చేయడానికి తమ ప్రాణాలకు సైతం లెక్క చేయమని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, మత్స్య శాఖ అధికారులు తమ రెండు గ్రామాల సమస్యను దృష్టిలో పెట్టుకొని ఈ చేపల చెరువులను తవ్వకానికి శాశ్వతంగా అనుమతులు నిలిపివేయాలని మీసాల డోలపేట, వెంకంపేట గ్రామ రైతులు కోరారు. అనంతరం తహశీల్దార్ చిన్నారావుకు వినతి పత్రం అందించారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ పంట పొలాలు చేపల చెరువులుగా మార్చడం సమంజసం కాదని, అనుమతులు కోసం తమ వద్దకు రాలేదని ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తామని చెప్పారు.

తహశీల్దార్‌కు వినతినిస్తున్న రైతులు

ప్రతి ఒక్కరినీ పనిలోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

గ్రామాల్లో పని అడిగిన ప్రతి ఒక్కరినీ పనిలోకి తీసుకోవాలని ఉపాధి హామీ ఎపిడి కె.రామామణి అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీల రోజు వారీ లక్ష్యాలను పూర్తి చెయ్యాలని, కొత్తగా జాబ్ కార్డులు కావాల్సిన వారికి మంజూరు చెయ్యాలని చెప్పారు. రోజు కూలి రూ.300 వరకు వచ్చేలా పని చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రవికుమార్, ఎపిఒ లక్ష్మి పతిరాజు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ : ఉపాధి పనులకు రాని వారి జాబ్‌కార్డులు రద్దు చేస్తామని ఎపిఒ ఆదిలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలో సుమారు పది వేల మందికి ఉపాధి హామీ పనులు కల్పించినట్లు తెలిపారు. కొన్ని గ్రామాల్లో నేటికీ వేతనదారులు పనికి వెళ్లడం లేదని చెప్పారు. ఫీల్డ్‌అసిస్టెంట్లు పిలుస్తున్నా రావడం లేదని, సొంత పనులు చేసుకుంటున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి వారిని గుర్తించి, జాబ్‌కార్డులు రద్దు చేస్తామని చెప్పారు. పని కావాల్సిన వారికి జాబ్‌కార్డులు అందిస్తామని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రమామణి

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది సోమవారం పరిశీలించారు. 56వ సచివాలయ పరిధిలో రహదారుల పాక్షిక మరమతులను పరిశీలించారు. తుమ్మగుంటి వారి వీధిలో తాగునీరు వృథాగా పోతుందని గమనించి, వెంటనే వాల్వ్ ఆపరేటర్‌తో ఆన్ ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేయించారు. రాజీవ్ నగర్ ప్రాంతంలో 200 హెచ్ డిపిఇ ఇంటర్ కనెక్షన్ పైప్‌లైన్‌కు మరమతులు చేపట్టారు. పెద్ద చెరువు అవుట్ ఫ్లో ప్రధాన కాలువ ప్రక్షాళన కోసం ప్రాథమిక పరిశీలన చేపట్టారు. ఇఇ టి.రాయల్ బాబు, ప్రొఫెసర్ మల్లేశ్వరరావుతో కూడిన బృందం ముందుగా ఎల్ఐసి భవనం వద్దనున్న ఉన్న కాలువ ప్రాంతాన్ని, ఆ తర్వాత నాలుగెస్సుల డిగ్రీ కాలేజ్ ప్రాంతంలో ఉన్న కాలువను, అనంతరం ధర్మపురిలో ఉన్న ప్రధాన రహదారి కాలువను పరిశీలించారు. గాజులరేగలోని గుభేల్ పేట ప్రాంతంలో పాత పైపులైన్ నుంచి కొత్త పైపులైన్ ద్వారా కొళాయి కనెక్షన్ ఏర్పాటు చేశారు. జిల్లా సర్వజన ఆస్పత్రిలో నిర్మిస్తున్న మరుగుదొడ్లను డిఇ మణికుమార్ పరిశీలించారు. అయ్యకోనేరు ఉత్తర గట్టు ప్రాంతంలో సిసి డ్రెయినుకు ఆనుకొని గోడ నిర్మాణ పనులను డిఇ, ఎఇలు పరిశీలించారు.

పనులు పరిశీలిస్తున్న అధికారులు

పారిశుధ్య పనులు పరిశీలన

నగరంలో చేపడుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ పల్లి నల్లనయ్య సోమవారం తెల్లవారుజామున పరిశీలించారు. రైల్వేస్టేషన్ రోడ్డు, ట్యాంక్ బండ్ రోడ్డు, ఎన్‌సిఎస్ థియేటర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనితీరును గమనించారు. నిర్ణీత సమయానికి విధులకు సిబ్బంది హాజరవుతున్నారా? లేదా అన్న విషయాన్ని పారిశుధ్య పర్యవేక్షకులను అడిగి తెలుసుకున్నారు.

బాధితులకు చెక్కు అందజేస్తున్న బొత్స చైతన్యబాబు

కుష్టు వ్యాధి బాధితులకు రూ.10 వేలు విరాళం

ప్రజాశక్తి - విజయనగరంటౌన్

కుష్టు వ్యాధి బాధితులకు ప్రత్యేక పాదరక్షలు నిమిత్తం బొత్స లక్ష్మణరావు తనయుడు బొత్స చైతన్యబాబు రూ.10 వేలు విరాళం అందజేశారు. విజయనగరంలో వైసిపి నాయకులు పతివాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో బొత్స చైతన్య జన్మదినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లెప్రా సొసైటీ రిసోర్స్ ఎగ్జిక్యూటివ్ లెంక రమణకు బొత్స చైతన్య రూ.10 వేలు విరాళం అందించారు. లెంక రమణ మాట్లాడుతూ జిల్లాలో లెప్రా సొసైటీ జిల్లా ప్రభుత్వ మహారాజ ఆసుపత్రిలో జిల్లా కుష్టు నివారణ అధికారి సహకారంతో బాధితులకు అంగవైకల్యం నివారణకు రిఫరెల్ సెంటర్ ద్వారా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా కుష్టు వ్యాధి బాధితులకు ఉచితంగా ప్రత్యేక పాదరక్షలు, సెల్ఫ్ కేర్ కిట్లు, ఫిజియో థెరపీ సేవలు అందించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా దాతలు నుండి విరాళాలు సేకరిస్తున్నామన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - వంగర

మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఎస్ఐ వి.ప్రసాద్ అన్నారు. మండలంలోని మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాహనంలో వీడియో ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలు వల్ల కలిగే నష్టాలు గూర్చి అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలను నడపడం వల్ల జరిగే ప్రమాదాలు చర్యలు గూర్చి వివరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోట రవిశంకర్, హెచ్‌సి నాయుడు కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

వేపాడ : మండలంలోని జగ్గయ్యపేటలో ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ బాలభాస్కరరావు సోమవారం సందర్శించారు. హాజర పట్టిక, ఉపాధ్యాయులు డైరీ, విద్యార్థుల వర్క్‌బుక్స్ పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేశారు.

అప్పలనాయుడు కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- డెంకాడ

ఇటీవల రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన వైసిపి నాయకుడు బోని అప్పలనాయుడు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పద్మావతి దంపతులు సోమవారం పరామర్శించారు. అప్పలనాయుడు భార్య పిల్లలను పరామర్శించి తన సానుభూతిని తెలియజేశారు. అప్పలనాయుడు మృతి వైసిపికి, గ్రామానికి తీరనిలోటని అన్నారు. కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని తన సహాయ సహకారాలు ఎల్లవేళలా కుటుంబానికి ఉంటుందని తెలిపారు.

ఎమ్మెల్యే కళాకు మంత్రి కొండపల్లి పరామర్శ

ప్రజాశక్తి-రేగిడి

మండల కేంద్రం రేగిడి గ్రామంలో మాజీ మంత్రి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే కిమిడి గణపతిరావు ను రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం పరామర్శించారు. ఎమ్మెల్యే కళా వెంకట్రావు సోదరుడు, ఆధ్యాత్మిక వేత్త కిమిడి సత్యనారాయణ నాయుడు ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కళా వెంకటరావును కలిసి పరామర్శించారు. ఈ ప్రాంతానికి ఆధ్యాత్మిక ప్రవచనాలు అందించిన గొప్ప వ్యక్తిని కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు. ఆ కుటుంబానికి సానుభూతి తెలిపారు.


కళా వెంకటరావును పరామర్శిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి

గజపతినగరం : మండల కేంద్రంలోని దిగువ వీధిలోగల పైడితల్లి అమ్మవారి ద్వితీయ వార్షికోత్సవ ఉత్సవాల్లో రాష్ట్ర సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం సాయంత్రం పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి హారతి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. అంతకుముందు ఆలయ ధర్మకర్త కందుల వెంకట చిన్నయ్య స్వామి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు మంత్రి కొండపల్లి శ్రీనివాసుకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆయన వెంట మాజీ ఎంపిపిలు గంట్యాడ శ్రీదేవి, మక్కువ శ్రీధర్, టిడిపి నాయకులు వైకుంఠం ప్రదీప్ కుమార్, సర్పంచ్ నరవ కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సోమరాజుపేట పంచాయతీలో రాయికర్ర చెరువు పనులను ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ సోమవారం పరిశీలించారు. చెరువు పనిలో 58 మంది వేతనదారుల మస్తర్లను తనిఖీ చేశారు. వేతనదారులతో మాట్లాడుతూ రెండు పూటలా పనిచేయాలని కోరారు. కొలతలు ప్రకారం పనిచేస్తే రూ.300 వస్తుందని అని తెలిపారు. చేసిన కూలీల మస్తర్లను మేట్లు ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా రెండు పూటాలా పంపించాలన్నారు.

మహారాజశ్రీ విజయనగరం ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జివారి కోర్టులో
IA 181/2024 in AS /2024

బిట్వీన్:
శ్రీమతి దాసరి పాపమ్మ మరియు
....పిటీషనరు/అప్పిలెంటు
ఎండ్ :
గిరిడి చిన్నప్పడు మరియు ఇతరులు...రెస్పాండెంట్లు

నోటీసు

టు
రెస్పాండెంట్ నెంబరు -6
గిరిడి మహేష్, S/o లేటు గొల్ల @ రామునాయుడు, వయసు 25సం॥, R/o of Vangaplli Peta, చీపురుపల్లి గ్రామం మరియు మండలం, విజయనగరం జిల్లా.

పైన పేర్కొన్న పిటీషనరు నెంబరు కాని AS /2024 దాఖలు చేయడం ఆలస్యం అయినందున సదరు ఆలస్యమును కండోను చేయు నిమిత్తం IA 181/2024 పిటీషనరు దాఖలు చేసియున్నారు. సదరు పిటీషను మీ హాజరు నిమిత్తం **తే 18-2-2025దీ**న వాయిదా అయి ఉన్నది. కనుక ఆ దినమున **ఉదయం గం॥10-30ని॥**లకు స్వయంగా కాని వకీలు ద్వారా కాని పై కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియచేయవలయును. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.
(కోర్టువారి ఆర్డరు ప్రకారం)

ఇట్లు
బెల్లాన రవి
అడ్వకేటు,
విజయనగరం


ఎమ్మెల్యే లలితకుమారికి వినతినిస్తున్న నిమ్మలపాలెం గ్రామస్తులు

జిందాల్ కాలుష్యం నుంచి కాపాడండి

ఎమ్మెల్యేకు నిమ్మలపాలెం గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి-లక్కవరపుకోట

కొత్తవలస మండలం అప్పన్నపాలెం పంచాయతీ పరిధిలోని జిందాల్ పరిశ్రమ కాలుష్యం బారి నుంచి కాపాడాలని నిమ్మలపాలెం గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం లక్కవరపుకోటలోని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి క్యాంపు కార్యాలయంలో ఆమెను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు కొట్యాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ మండలి సూచనలు పాటించకుండా కర్మాగారం నుంచి విపరీతమైన పొగ, ధూళి విడుదల చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. దీనివల్ల తినే ఆహారం, తాగునీరు, పీల్చే గాలి కలుషితం అవుతున్నాయని, పిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారని వాపోయారు. ఇప్పటికే ఈ కాలుష్యం వల్ల ముగ్గురు వ్యక్తులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య నీటితో పశువులు నీరసించి, అనారోగ్యాల పాలవుతున్నాయని తెలిపారు. గతంలో అనేకసార్లు ఉన్నతాధికారులకు, కంపెనీ యాజమాన్యానికి వినతులు అందజేసినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వెంటనే జిందాల్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి- మెంటాడ

గ్రామాల అభివృద్ధిపై టిడిపి నాయకులు, కార్యకర్తలు దృష్టిసారించాలని టిడిపి మండల అధ్యక్షులు చలుమూరి వెంకటరావు సూచించారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులకు ప్రాధాన్యతను బట్టి దరఖాస్తుల రూపంలో అందజేయాలని కోరారు. నిబంధనల మేరకు ప్రజల సమస్యలను అధికారులతో చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని కార్యకర్తలు సమావేశంలో ప్రస్తావించారు. దీనిపై టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు గెద్ద అన్నవరం మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా సమస్యలను పరిష్కరించాలంటే, అధికారులు కూడా ఏమి చేయలేరని స్పష్టంచేశారు. కార్యక్రమంలో పెదమేడపల్లి, కొండలింగాలవలస ఎంపిటిసిలు రెడ్డి ఎర్రన్నాయుడు, గుమ్మడి ప్రవీణ్ కుమార్, మణిపూరి రామారావు, సూరెడ్డి కృష్ణమూర్తి, మహంతి సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ ఉత్పత్తులతో ఆరోగ్యం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించే సేంద్రీయ ఉత్పత్తులతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని ఎపిఎం వై.రమణ తెలిపారు. పట్టణంలోని మండల సమాఖ్య కేంద్రం వద్ద ఎపిసిఎన్ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేంద్రీయ ఉత్పత్తుల స్టాల్స్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ స్టాల్స్‌లో చిరుధాన్యాలు, మిల్లెట్స్ పౌడర్లు, కూరగాయలు, ఆకుకూరలు తదితర ఉత్పత్తులను ఏర్పాటు చేశారు. మండల పరిషత్తు కార్యాలయానికి వచ్చిన అధికారులు, రైతులు ప్రకృతి ఉత్పత్తులను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో విఒపిఆర్‌డి లక్ష్మి, ఐసిడిసి యూనిట్ ఇన్‌ఛార్జి కృష్ణ, ఐసిఆర్‌పి రాము, విఒలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారుల సేవా కేంద్రాన్ని సందర్శిస్తున్న ఎల్‌హెచ్ఒ డిఎం రామకృష్ణ

ఎస్‌బిఐ సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-రామభద్రపురం

ఎస్‌బిఐ ఖాతాదారుల సౌలభ్యానికి ఐవిఆర్ఎస్ సేవలు అమల్లోకి తెచ్చిందని, వీటిని వినియోగించుకొని సమయాన్ని ఆదా చేసుకోవాలని ఎల్‌హెచ్ఒ అమరావతి డిప్యూటీ మేనేజర్ రామకృష్ణ తెలిపారు. సోమవారం బొబ్బిలి ఆర్‌బిఒ ఎఫ్ఐసి మేనేజర్ సత్యానందంతో కలిసి వివిధ ఖాతాదారుల సేవా కేంద్రాలను సందర్శించారు. ఇటీవల ఎస్‌బిఐ ఆధ్వర్యంలో సుమారు 40 రకాల సేవలు ఐవిఆర్ఎస్ విధానంలో చేసుకొనే అవకాశం కల్పించడం ఆనందదాయకమన్నారు. సేవా లోపాలు, బ్యాలెన్స్ విచారణ వంటి వివరాలన్నీ టోల్ ఫ్రీ నెంబర్ 18001234 ద్వారా తెలుకోవచ్చన్నారు. అనంతరం సిఎస్‌పి కేంద్రాల్లో సేవా వివరాలతో కూడిన వాల్‌పోస్టర్లు అతికించారు. ఈ కార్యక్రమంలో రామభద్రపురం సిఎస్‌పి సత్యారావు పట్నాయక్, ఆరికతోట సిఎస్‌పి అరుణశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాకేరు జాతర

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరు గ్రామంలో మంగళ, బుధవారాల్లో జాతర నిర్వహిస్తున్నట్లు టిడిపి నాయకులు బుద్ద అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పలు రకాల పోటీలు కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జాతరను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

చదరంగంలో విజేతలైన విద్యార్థులు

చదరంగం పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్రా చెస్ అసోసియేషన్, శ్రీ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా ఓపెన్ చదరంగం పోటీలు రింగ్ రోడ్డులోని ఫైర్ చెస్ స్కూల్లో నిర్వహించారు. ఆంధ్రా చెస్ అసోసియేషన్ సిఇఒ కెవి జ్వాలాముఖి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు వంద మంది బాల బాలికలు హాజరయ్యారు. బాల, బాలికల విభాగాల్లో వేర్వేరుగా విజేతలకు నగదు బహుమతులు అందించారు. బాలుర విభాగంలో యశ్వంత్, వెంకట రావు, మణికంత, కృష్ణసాయి సూరజ్, బాలికల విభాగంలో అనన్య, సత్య శ్రీ వల్లి, సాయిదృతి, వైష్ణవి విజేతలుగా నిలిచారు. ఈ పోటీలో ఫైర్ చెస్ సిబ్బంది పి.అర్చన, కె.ధనలక్ష్మి , ఎ.దామోదర రావు పాల్గొన్నారు.